- పునఃప్రారంభం అనంతరం పట్టించుకోని యాజమాన్యం
- కార్మికశాఖ అధికారులను కలిసిన నాయకులు
- అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే హరీష్‌బాబు ప్రస్తావన
- చర్యలు తీసుకోవాలని కార్మికుల డిమాండ్



ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు ఎప్పుడు?

కాగజ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్‌లో ఉన్న ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో కూడా విషయాన్ని ప్రస్తావించారు. సిర్పూరు పేపర్ మిల్లును 2014లో బిర్లా యాజమాన్యం షెడ్ డౌన్ పేరిట మూసివేసింది. 2018లో జేకే యాజమాన్యం ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. కానీ ఇంత వరకు ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.సమస్యలను యాజమా న్యం పట్టించుకోవడం లేదని, కనీసం క్యాంటిన్ సౌకర్యం కూడా లేదని కార్మికులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు కూడా కలిసి హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకో వాలని వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం లేక పోవడంతో యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, అలా గే స్థానికేతరులకు ఎక్కువ, స్థానికులకు తక్కువ జీతాలు ఇచ్చి వ్యత్యాసం చూపిస్తోందని పలువురు మండి పడుతున్నారు. మిల్లులో ప్రమాదాలు జరిగిన సమయంలో కూడా కార్మికులు మృతి చెందితే న్యాయపరంగా రావాల్సిన బెనిఫిట్స్ కూడా ఇవ్వ కుండా తప్పించుకునే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

● కార్మికశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే..

ఎస్పీఎంలో 2018 నుంచి ఎన్నికలు నిర్వహించక పోవడం కేవలం కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఉందని కార్మికులు చెబుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పునరుద్ధరణ జరిగింది. కానీ ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహిం చలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతాయని కార్మికులు భావించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేపట్టి 15 నెలలు దాటినా ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఆరు నెలల క్రితం అన్ని కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్ లేబర్ కమిషనర్‌కుసమస్యలు ప్రస్తావిస్తూ వినతిపత్రం అందజేశారు. ఎస్పీఎం యాజమాన్యం నుంచి స్పందన రాక పోవడంతో మళ్లీ వారం రోజుల క్రితం కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందన లేక పోవడంతో అసెంబ్లీలో సిర్పూరు ఎమ్మె ల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం మూడు రోజు క్రితం కూడా లేబర్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా లేబర్ అధికారులు స్పందించి ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

● ప్రధాన సమస్యలు ఇవీ..

ఎస్పీఎంలో పలు ప్రధాన సమస్యలు ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు. మిలు పరిధిలో క్యాంటిన్ సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కార్మికులకు అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించే అవకాశం ఉండేది. గత యాజమాన్యం ఈ సౌకర్యం కల్పించింది. కొత్తగా తీసుకున్న జేకే యాజమాన్యం మాత్రం క్యాంటిన్ సౌకర్యాన్ని పూర్తిగా తీసివేసింది. అలాగే కార్మికులు విధి నిర్వహణలో మృత్యువాత పడితే కార్మిక చట్టాల ప్రకారం రావాల్సిన బకాయిలు ఎంత మేర ఇస్తున్నారన్నదీ ఇంత వరకు ప్రకటించడం లేదు. ఏడాదికి 30 సెలవులు ఉండాల్సి ఉంది. దీన్ని 26కు తగ్గించారు. కార్మికుల డిసిగ్నేషన్ సైతం తొలగించారు. జీతాల పెంపు విషయంపై కూడా సందిగ్ధత నెలకొంది. గత యాజమాన్యం వార్షిక లాభాలపై బోనస్ కూడా ప్రకటించేది. ప్రస్తుతం జేకే యాజ మాన్యం దీన్ని కొనసాగించడం లేదు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

కౌటాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గణపతి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు రాజేంద్రగౌడ్, విజయ్, నహీం అహ్మద్, అజ్మత్ అలీలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు సన్మానించారు. అనంతరం జిల్లాలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, ముషీర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

వాంకిడి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డేను నిర్వహించడం లేదని, ప్రతి నెలా 30న తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ అశోక్ కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు కేశవ్‌రావు, గోపాల్‌నాయక్, గణేష్, వెంకటేష్, గంగుబాయి తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



రవీందర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ అన్నారు. శుక్రవారం అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌ను ఆయన నివాసంలో పలువురు న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజీవ్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రకుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన

కెరమెరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లిం పర్సనల్ బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కెరమెరి మండల కేంద్రంలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇష్తేకార్ అహ్మద్, నిసార్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలించాలి

జైనూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశీలకు డాక్టర్ సాగర్ కోరారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమలో డీపీఎంవో శ్యాముల్, మలేరి యా సబ్ యునిట్ అధికారి గణేశ్, హెచ్ ఈవోలు రమేశ్, పవార్ దిలీప్ కుమార్, హెల్త్ అసిస్టెంట్లు భరత్, జంగు, జల్పత్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

ఆసిఫాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ నెట్‌వర్క్ టవర్ల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహజంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లాలో మంజూరు అయిన 9 టవర్లలో 8 టవర్ల నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు లేనందున వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు పొంది టవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కెరమెరి మండలంలోని పరందోళిలో ఏర్పాటు చేసే టవర్‌కు రెవెన్యూ, అటవీ శాఖాధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని, జిల్లాకు అదనంగా 16 టవర్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ టవర్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎఫ్‌ఓ సుశాంత్, బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్ సర్కిల్ జీఎం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జీఎం జగ్రామ్ తహసీల్దార్‌లు కిరణ్, దత్తు ప్రసాద్, అటవీ రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

'బీసీ పోరు గర్జన'ను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలుకు ఏప్రిల్ 2న ఢిల్లీలో జిరగే బీసీ పోరు గర్జనను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నార్ రమేష్ కోరారు. శుక్రవార పోరు గర్జన పోస్టులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు లహంకుమార్, మారుతి, శంకర్, ఏసయ్య, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగను పురస్కరించుకొని శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు మైనార్టీలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్ని వర్గాల ప్రజలు తమ పండగలను ఘనంగా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ తోఫాలను పంపిణీ చేశామని అన్నారు. పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంల నాయకులు మల్లికార్జున్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, విజయ్, విశాల్, పెంటయ్య, జయరాజ్, ముషీర్, నజీర్, సంతోష్‌యాదవ్, శ్రీశైలం యాదవ్, వెంకన్న, నాసర్, తదితరులు పాల్గొన్నారు.

వార సంత వేలం

దహెగాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వార సంతకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన నాగుల రామచంద్రు రూ.2,43,000లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, కార్యదర్శి ప్రణీత్‌బాబు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శశికుమార్, ఉపాధ్యక్షుడిగా స్వాగత్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్, సంయుక్త కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా కిరణ్‌తో పాటు సభ్యులుగా బిట్టు, కిరణ్, నాగేందర్, శ్రీకృష్ణను ఎన్నుకున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా శిశు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ ద్వారా నిర్వహించిన క్యాంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని ఏసీఎంఓ ఉద్ధవ్ అన్నారు. వాంకిడి మండలంలోని చౌపన్‌గూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. లక్ష్యం ఏర్పాటు చేసుకొని నిరంతరం చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ చిరంజీవి, క్రీడల అధికారిని మీనాకుమారి, హెచ్ఎం మనోహర్, సిడాం అన్నిగా తదితరులు పాల్గొన్నారు.

పశువులు పట్టివేత

పెంచికలపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం ఉదయం ఎల్కపల్లి పెట్రోల్ పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు మండలం మర్తిడి గ్రామం నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సంతకు తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని సమాచారం మేరకు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కరీంనగర్‌కు చెందిన జాఫర్, అహ్మద్ రఫీ, బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ధాన్యం నిలువల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడబ్ల్యూసీ మేనేజర్ రవికుమార్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పంట కోతల అనంతరం ధాన్యం నిలువల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ(సీడబ్ల్యూసీ) ఆదిలాబాద్ మేనేజర్ వరికుంట రవికుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మిలింద్‌కుమార్, హెచ్‌డీఎఫ్సీ బ్యాంకు మేనేజర్ విజయేందర్‌రెడ్డి, ఏఈఓలు చిరంజీవి, రాము, దర్మడాన్, సీడబ్ల్యూసీ సూపరింటెండెంట్ గౌతమ్, సిబ్బంది సాయి, పణీంద్ర, టెక్నికల్ అధికారి శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

నీలుగాయిని వేటాడిన ఆరుగురిపై కేసు



అధికారులు అదుపులోకి తీసుకున్న నిందితులు

పెంచికలపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్పల్లి అటవీ ప్రాంతంలో నీలు గాయిని వేటాడి చంపిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున నీలుగాయిని వేటాడుతున్నారనే సమాచారంతో అటవీ అధికారులు తనిఖీలు నిర్వహించారని చెప్పారు. కొండపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, రవి, మొండి, శ్రీహరి, భీమయ్య, ఎల్లూరుకు చెందిన దుర్గం రవీందర్‌ను గుర్తించామని అన్నారు. వీరిలో రవీందర్, వెంకటేష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా మిగితా వారు తప్పించుకొని పోయారని అన్నారు. రవీందర్ మేరెగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విదులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాలేగూడలో సమస్యల తిష్ఠ

- అధ్వానంగా రోడ్లు
- డ్రైనేజీలు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా మారిన సాలేగూడ రోడ్డు(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలేగూడ గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లా కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న సాలేగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు కిలో మీటరు దూరంలో ఉంది. కిలో మీటరు వరకు ఉన్న మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చలని గ్రామస్థులు రెండు దశాబ్దాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్న మట్టిరోడ్డు గుంతల మయంగా మారడంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో మురికి కాలువలు, రోడ్డు లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. మురికి కాలువలు లేక నీరంత రోడ్డుపై నిలిచి ఉండడడంతో దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. నీరు నిలువ ఉండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికెనా అధికారులు ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బీసీ కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి యువరాజు, పాల్గొన్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి యువరాజు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేసులు, శిక్షలు, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. యాక్సిడెంట్ కేసులలో బాధితులకు త్వరితగతిన నష్ట పరిహారం వచ్చేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో చాలా వరకు కేసులు పరిష్కారం అవడం సంతోషకరమని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, రమేశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి


ఆసిఫాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోక్సో, గ్రేవ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు.. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. . కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సీసీ టీవీలు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైం, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆసిఫాబాద్ సీఐ రవీందర్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, వాంకిడి ఎస్సై ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ బాపురావు, హెడఖ కానిస్టేబుల్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సుబాష్, కానిస్టేబుళ్లు ఉమేష్, దయానంద్, ఫూలసింగ్, ఇందల్, దత్త, వనిత, తేజస్విని, రాజు, నాగరాజులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామనుజం, రమేష్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన



ఆసిఫాబాద్ బస్టాండు ఎదుట ధర్నా చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల రిక్రూట్‌మెంట్‌లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఉన్నతాధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బస్టాండు ఎదుట ప్రైవేటు అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ యజమాన్యం అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా డ్రైవర్లను రిక్రూట్‌మెంట్ చేసుకుంటామని నోటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు. అందు కోసం ఆసిఫాబాద్ డిపో నుంచి సుమారు 250 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో ప్రైవేటు అద్దె బస్సు డ్రైవర్లు కూడా ఉన్నారని కానీ వీరికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడి కొంత మందికి మాత్రమే సమాచారం ఇచ్చి ఈ నెల 26న రిక్రూట్‌మెంట్ చేసుకున్నారన్నారు. దానిని వెంటనే రద్దు చేసి అర్హులందరిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎం రాజశేఖర్‌కు అందేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, షఫి, బాలేష్, భాస్కర్, తిరుపతి, శోభన్, విజయ్‌కుమార్, సాయి, నగేష్, ఇమామ్, ఫైమద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



- వడదెబ్బ తగిలే ప్రమాదం
- అవసరమైతేనే బయటకు వెళ్లాలని వైద్యుల సూచన

బెజ్జూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 38నుంచి 40 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా పెరుగుతాయని వాతా వరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారు వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో డీహైడ్రేషన్, ఫుడ్ పాయిజనింగ్ వరకు కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

● ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు..

- తెలుపు రంగు, పలుచటి కాటన్ దుస్తులు దరించాలి
- బయటకు వెళ్లేముందు తలకు టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి
- ఓరల్ రీ హైడ్రేషన్ కలిపిన నీటిని తాగవచ్చు
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి ప్రాంతానికి తీసుకెళ్లాలి
- వడదెబ్బకు గురి అయిన వారిని తడి వస్త్రంతో శరీరం అంతా తుడుస్తూ ఉండాలి
- ఐస్ నీటిలో వస్త్రాన్ని ముంచి శరీరం అంతా తుడవాలి.శరీర ఉష్ణోగ్రత 101పారన్‌హీట్ డిగ్రీల కంటే తక్కువ అయ్యేంత వరకు తుడుస్తూ ఉండాలి
- వడదెబ్బకు గురైన వారు సాదారణ స్థితికి రాకపోతే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
- మంచినీరు ఎక్కువసార్లు తాగుతుండాలి
- ఎండలో నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం లేదా కొబ్బరి నీరు, చల్లని నీరు తాగాలి
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరుగుడు, ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి

● చేయకూడనివి..

- సూర్యకిరణాలకు, వేడి గాలికి గురి కాకుండా ఉండాలి
- ఎండ బాగా ఉంటే గొడుగు తీసుకెళ్లడం ఉత్తమం
- నలుపు, మందంగా ఉన్న దుస్తులు వేసుకోకూడదు
- వడ దెబ్బకు గురి అయిన వారిని వేడి నీటిలో ముంచిన వస్త్రంతో తుడవకూడదు
- ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఆలస్యం చేయకూడదు
- ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండలో వెళ్లకుండా చూసుకోవాలి. ఒకవేళ వెళ్లవలిసి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఎండలో నుంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు, తేనె వంటివి తీసుకోకూడదు
- శీతల పానియాలు, మంచు ముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు రావచ్చు

● చర్మం పాడవకుండా..

- మామూలు రోజుల కంటే ఒక లీటరు నీరు ఎక్కువగా తాగాలి
- చర్మం పొడిబారకుండా చూసుకోవాలి. డీ హైడ్రేషన్ గురి కాకుండా శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలి
- ఎండలోకి వెళ్లేముందు రోజ్ నీటిని ముఖానికి పూసుకుంటే మంచిది
- నీటితో కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమ్‌ను పూసుకోవాలి
- ముఖాన్ని ఎక్కువ సార్లు సబ్బుతో కడగకూడదు
- వీలైనన్నిసార్లు చల్లటి నీటితో కడుక్కోవడం మంచిది.

● అత్యవసరమైతేనే బయటకు రావాలి..



ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని అవసరమైతేనే బయటకు వెళ్లాలి. దూర ప్రయాణాలు మానుకోవాలి. తరచూ నీళ్ల తాగాలి. వాంతులు, విరేచనాలు ఉంటే వైద్యం చేయించుకోవాలి. అలసత్వం చేస్తే కొన్నిసార్లు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది.

- డాక్టర్ అవినాష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బెజ్జూరు

జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు

కాసిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దధర్మారంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలను శుక్రవారం యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న ప్రాచీన ఎడ్ల బండ్ల పోటీలను పునరుద్ధరించేందుకు ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 16మంది రైతులు పాల్గొన్నారు. మొదటి బహుమతి గెల్లి గణపతి రూ.10వేల నగుదతో పాటు షీల్డ్(చిన్న వెంకటాపూర్) అందజేశారు. రెండో బహుమతి అభయదేవ (ఊరుమంద మర్రి) రూ.8వేల నగదు షీల్డ్ అందజేశారు. మూడో బహుమతి పుట్టశేఖర్ (ముత్యంపల్లి కాసిపేట మండలం) రూ.7వేల నగదుతోపాటు షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు తాగాలి

భీమిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సురక్షితమైన మిషన్ భగీరథ నీటినే తాగాలని జిల్లా మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మామిడిగూడ గ్రామంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. దీనిలో మిషన్ భగీరథ తాగునీటిపై కలిగే ప్రయోజనాలు, వాగులు చెలిమెల నీరు వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై పరీక్షించి గ్రామస్థులకు వివరించారు. వాగుల్లోని చెలిమెల నీటిని ఎవరూ తగవద్దని అది సురక్షిత నీరు కాదన్నారు. మిషన్ భగీరథ నీరు తాగడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ గ్రిడ్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ పోశం, కార్యదర్శి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల చైర్మన్‌గా భూక్య సురేష్

రెబ్బెన, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిల్‌గూడ గ్రామానికి చెందిన భూక్య సురేష్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా నియమించినట్లు ఆ కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ ద్వారా పేదలకు, సామాన్యులకు సేవలు అందించాలని సూచించారు.

కరపత్రాలు విడుదల

ఆసిఫాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మహాసభల కరపత్రాలను శుక్రవారం తుడుందెబ్బ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, నాయకులు మారుతి, లాల్‌శావ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు వెంటనే న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఆసిఫాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆర్ఓఆర్, అట్రాసిటీ, భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలకు కల్పించే ప్రయో జనాలపై జిల్లా అధికారులతో కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల వివరాలు, బాధితులకు జరిగిన న్యాయం, ఎస్సీ, ఎస్టీలకు జరిగిన భూ పంపిణీ, భూ వివాదాలు, పోడు భూముల పరిష్కారం, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అన్ని శాఖలలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పిస్తున్న పదోన్నతులు, రోస్టర్ విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సంబంధిత సమస్యలను, కేసులను ఈ నెల 31 లోగా పరిష్కారమయ్యే విదంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులలో ఎవరికి అన్యాయం జరగకుండా చూడాలని చెప్పా రు. పోడు వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజనులకు నిబంధనల ప్రకారం ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని సూచించారు. మూడు నెలలకోసారి కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల సమస్యలు, అట్రాసిటీ కేసులో బాధితులకు అందిస్తున్న పరిహారం అంశాలపై సమీక్ష నిర్వహించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, కూసం నీలాదేవి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు, దీపక్ తివారి, డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖాధికారి సజీవన్, జిల్లా అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కేశవరావు, గోపాల్, గణేశ్, అశోక్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జామ మసీద్ ఇమామ్ మౌలానా అయాజ్ అహ్మద్ అష్రఫీ, నాయకులు అబ్దుల్ రహెమాన్‌లు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామా మసీద్‌లో చేతికి బ్లాక్ బ్యాండ్ ధరించి నిరసన తెలిపారు కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, అహ్మద్, తాజ్, షాకీర్, రహెమాన్, అర్షద్, ఖలీల్, నయీమ్‌ఖాన్, అబ్బు, సాలం, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాగజ్‌నగర్‌లో శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు స్థానిక అంబేద్కర్ చౌక్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వెంటనే ఉపసంహరించుకోవాని కోరారు. కార్యక్రమంలో జెఐహెచ్ పట్టణాధ్యక్షుడు బషీరుద్దీన్, నాయకులు జాకీర్ షరీఫ్, అజరుద్దీన్, సాదిక్ పాషా, దావూద్ అహ్మద్, వలిదాత్ ఖాన్, ఎజాజ్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఖదీమ్ మసీద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థన సందర్భంగా ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మౌలానా ఓసామబీన్ అవద్, మాజీ ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రఫీక్, ఉపాధ్యఉలు ఇఫత్ హుస్సేన్, నాయకులు అబ్దుల్ కలాం, అబ్దుల్ కపీల్, కలీం, ఇలియాజ్ అహ్మద్, ఖాజనజ్ముద్దీన్, రజి అహ్మద్, కుర్షిద్‌హుస్సేన్, ఖాసీం, హలీం, హఫీస్, ఆరీఫ్, వాయిస్, రఫీక్, పషి, ఫారూక్, ముసవీర్, అజం తదితరులు పాల్గొన్నారు.



విధులకు గైర్హాజరు కావొద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావొద్దని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ గనుల్లో పనిచేస్తూ 100 మస్టర్లు నిండని ఉద్యోగులకు శుక్రవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మీ తల్లిదండ్రులు ఉద్యోగం చేస్తున్న సమయంలో పరిస్థితులు ప్రస్తుతం లేవని, హాజరు శాతాన్ని పెంచుకొని ఉద్యోగాన్ని కాపాడుకోవాలని కోరారు. ఇప్పటి నుంచి నెలకు 20 మస్టర్లు కలిగి ఉండాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు 56 మంది ఉద్యోగులు, తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవైపీఎం రాజేష్, సీనియర్ పీవోలు సంతన్, పాల్‌స్రుజన్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీకి వెళ్లిన మైనింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న వారి కోసం వెళ్లిన తమ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి మైనింగ్ సిబ్బంది కోరారు. ఈ మేరకు వారు హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు దుర్గం లక్ష్మణ్, నేముల బాలయ్య, తులా అనిల్, మీసాల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సింగరేణి సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

జైపూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను బీఎంఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, జాతీయ సేఫ్టీ కమిటీ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఎస్టీపీపీ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్ ఆధ్వర్యంలో సీఎండీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగుల మాదిరిగా ప్రతి కార్మికుడికి రూ.5వేల ఎస్టీపీపీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని వినతి పత్రంలో కోరామని చెప్పారు. ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులకు పవర్‌మేట్ ప్రైవేటు యాజమాన్యం అమలు చేస్తున్న క్యాజువల్ లీవ్, సిక్ లీవ్, వేతనం లీవ్ ష్లేడేలు, పీహెచ్‌డీలు చెల్లించే మాదిరిగా సివిల్ డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని విజ్ఞప్తి చేశామని అన్నారు. మేరకు త్వరలోనే జైపూర్ పవర్ ప్లాంట్ యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పులిరాజారెడ్డి, ఎం. రమాకాంత్, బి శ్రీధర్, కిషన్‌రెడ్డి, శివక్రిష్ణ, చిలకాని వెంకటేష్, కె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

జైపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కార్మికులపై సింగరేణి అధికారులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్ఎంఎస్ యూనియన్ కేంద్రకమిటీ నాయకులు తిప్పారపు సారయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే1ఏ గనిలో హెచ్ఎంఎస్ నాయకుల ఆధ్వర్యంలో అధికారులకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సంఘం హెచ్ఎంఎస్ యూనియన్‌పై చేసిన ఆరోపణలను కార్మికులంతా ఖండించాలన్నారు. గనిలో ప్రమాదాలు జరిగినప్పుడు రిపోర్టులు రాయకుండా ప్రమాదానికి గురైన కార్మికుడి సొంత ఖర్చులతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాలని ఆదేశిస్తున్నారన్నారు. నిరాకరించిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటూ మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. గత 13న గనిలో జరిగిన ప్రమాదంలో ప్రమాదం నుంచి బయటపడిన కార్మికుడిని బాధ్యుడిని చేసి అధికారులు తప్పించుకున్నారని అన్నారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు అనిల్ రెడ్డి, పంబాల నర్సయ్య, వీస కొమురయ్య, రవీందర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు పట్టివేత

దండేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసిపేటలో గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై తైసొనోద్దీన్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరిస్తున్నట్లు అందిన సమాచారం గోదావరి నదిలో ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా పోలీసులు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన కొందరు ట్రాక్టర్ డ్రైవర్లు తప్పించుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇంధన్‌పల్లిలో మూడు..

జన్నారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్ జోన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్‌పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పక్కా సమాచారం మేరకు నిర్మల్ జిల్లా బస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామ సమీపంలో మూడు ట్రాక్టర్లను పట్టుకొని రేంజ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ తెలి పారు. అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వ ఉంచిన కేసులు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు జీఎం సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ శుక్రవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో సన్మానించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, ఎస్సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు..

- ఇరుకైన రహదారితో ఇబ్బందులు..?
- వాహనదారులకు నిత్యం కష్టాలే
- ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి ట్రాఫిక్ జామ్



చెన్నూర్ పట్టణంలోని గాంధీచౌక్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ జామ్

చెన్నూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పేరుకు మాత్రం చెన్నూర్ మున్సిపాలిటీ. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వ్యాపార వాణిజ్య కేంద్రంగా చెన్నూర్ ఉండడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రతి రోజూ రద్దీగానే ఉంటుంది. అయితే ఆ రద్దీకి తగ్గట్లుగా ప్రధాన రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారి అయిన గాంధీచౌక్ టు పాత బస్టాండ్ వరకు ఇరుకు రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలతో ముందుకు కదలలేని పరిస్థితి. ప్రతి 15 నిమిషాలకు ఒకసారి ఈ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో అటు ఉద్యోగులకు, ఇటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ఇలా అన్ని వర్గాలు ప్రజలు నానా యాతన పడుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ పరిస్థితి నెలకొనగా ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందోననే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● మూడు మండలాలకు ప్రధాన రహదారి

చెన్నూరు నుంచి మండలంలోని గ్రామాలతో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాలకు రవాణా సౌకర్యానికి ప్రధాన రహదారి ఇదే కావడంతో సమస్య తీవ్రంగా ఉంటోంది. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి చెరువు కట్ట బస్టాప్ వరకు సుమారు కిలోమీటరు మేర ప్రధాన రహదారి ఇరుకుగా ఉండి ఈ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సంస్థలు ఉన్నాయి. కిరాణ దుకాణాలు, వస్త్ర వ్యాపార సముదాయాలు, స్వీట్ హౌజ్‌లు, బ్యాంకులు, ఇంటర్నెట్ కేంద్రాలు, మందుల దుకాణాలు, హోల్‌సేల్ షాపులు ఇలా ప్రతి రంగానికి సంబంధించి వ్యాపారస్తులు ఉండగా ఈ రహదారి ఎప్పుడు వినియోగదారులతో కళకళలాడుతూ ఉంటుంది. పైగా వ్యాపార సంస్థలు రోడ్డు కిరువైపులా ఆనుకుని ఉండడంతో వినియోగదారుల ద్విచక్రవాహనాలు ఆయా దుకాణాల ముందు పెట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోటపల్లి, వేమనపల్లి మండలాలకు ఈ రహదారి గుండా బస్సులు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వస్తే ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడుతుండగా రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే సుమారు కిలోమీటరు మేర నిలిచిపోయి ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతూ ఉంటుంది. ఆ సమయంలో ఆసుపత్రులకు వెళ్లే రోగులు నానా యాతన పడుతుండగా అంబులెన్స్‌లు సైతం ముందుకు కదలాలంటే కనీసం 15 నిమిషాలు పడుతుంది. మూడు మండలాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెన్నూరే వ్యాపార కేంద్రం కావడంతో ప్రతి నిత్యం వేలాది మంది ప్రజలు చెన్నూరు పట్టణానికి వస్తుంటారు. దీంతో ఈ రహదారి సందడిగా ఉంటుంది.

● అసంపూర్తిగా బైపాస్ రహదారి..

పట్టణంలో ట్రాఫిక్ జామ్‌ను తగ్గించేందుకు బైపాస్ రహదారి అవసరమని గుర్తించిన నాటి పాలకులు, అధికారులు బైపాస్ రహదారి నిర్మాణానికి పూనుకున్నారు. చెన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పెద్దచెరువు, రావిచెట్టు బస్టాప్‌వరకు రోడ్డు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. దాదాపు రహదారి నిర్మాణానికి రూ.14కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారి పనులు ప్రాథమిక దశ దాటగా మొరం, మెటల్ పనులు పూర్తయినా ఆతర్వాత ప్రభుత్వం మారిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ రహదారి గుండా కోటపల్లి, వేమనపల్లి మండలాలకు బస్సులతో పాటు భారీ వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలు నడిచేందుకు మార్గం సుగమం అయ్యిందనుకుంటున్న దశలోనే పనులు నిలిచిపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సుమారు 2కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డుపై తారురోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పెట్టవచ్చు. ఇప్పటికైనా ఎమ్మెల్యేతో పాటు ఈ ప్రాంత నాయకులు, అధికారులు స్పందించి బైపాస్ రోడ్డు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పూర్తికాని బైపాస్ రహదారి

ప్రతి రోజు ఇబ్బందులే ..



అంబేద్కర్ చౌక్ నుంచి చెరువు కట్ట వరకు రహదారి ఇరుకుగా ఉండడంతో ప్రతి రోజు ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- పట్టి మహేష్‌గౌడ్, చెన్నూరు

బైపాస్ రహదారి పూర్తి చేయాలి



అంబేద్కర్ చౌక్ నుంచి చెరువు కట్ట వరకు ఉన్న ఇరుకు రహదారితో అనునిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బైపాస్ రహదారి పూర్తి చేస్తే కొంత మేర ట్రా ఫిక్ సమస్య తొలగిపోతుంది. ప్రధాన రహదారి ఇరు కుగా ఉండడం వలన గంటకోసారి ట్రాఫిక్ జామ్ అవుతూనే ఉంటుంది. బైపాస్ రహదారిని పూర్తి చేసి పెద్ద వాహనాలను దారి మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శంకర్, ఆటో డ్రైవర్, ఒడ్డేపల్లి

'ఆయుష్'తో పూర్తిస్థాయి ఆరోగ్యం

ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జి వైద్యురాలు పద్మజ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆయుష్‌తో పూర్తిస్థాయి ఆరోగ్యం పొందవచ్చని ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, ఇతర దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ఆయుష్ అంటే ఏమిటి ?

డాక్టర్ : ఆయుర్వేదం, యునాని, యోగా-నేచురోపతి, సిద్ధ, హోమియో పద్ధతులను కలిపి ఆయుష్ అంటారు.

ఆంధ్రజ్యోతి : జిల్లా లో ఎన్ని ఆయుష్ ఆస్ప త్రులున్నాయి ?

డాక్టర్ : ఆయుర్వేదం - 13, యునాని-5, హోమియో-3, యోగా-నేచురోపతి-1, సిద్ధ-0 ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారా?

డాక్టర్ : లేరు. ఆయుర్వేదంలో నలుగురు వైద్యులు, హోమియోలో ముగ్గురు వైద్యు లు, యునానిలో ఇద్దరు వైద్యులు, ఇతర సిబ్బంది మాత్రమే ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : ప్రతి రోజు ఎంత మంది వైద్యం పొందుతున్నారు ?

డాక్టర్ : ప్రతి రోజు అన్ని విధానాల్లో 30 మందికి పైగా వైద్యం పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి : యోగాకు ఎన్ని కేంద్రాలున్నాయి ?

డాక్టర్ : 10 యోగా కేంద్రాలుండగా, ఉదయం, సాయంత్రం వేళల్లో 19 మంది టీచర్లు యోగా నేర్పుతున్నారు.

-శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి)

వ్యక్తిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఓ రెస్టారెంట్‌లో దాడికి పాల్పడిన బడిసే రమేశ్‌తో పాటు మహేశ్, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రెస్టారెంట్‌లో శ్రీనివాస్, మల్లేశ్, అశోక్ మద్యం తాగి బిల్లు కట్టి వెళ్తుండగా రమేశ్‌తో పాటు మహేశ్, శ్రీకాంత్‌లు దాడికి పాల్పడ్డారని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్పుమంటున్న గుడుంబా..

(5వ పేజీ తరువాయి)

తయారు చేస్తున్న 772 లీటర్ల గుడుంబా, 1510 లీటర్ల బెల్లం పానకం, 65లీటర్ల స్పటిక ద్రావణంతో పాటు 23 వాహనాలను ఎక్సయిజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా స్థావరాల్లో పెద్ద ఎత్తున గుడుంబా తయారీ చేస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సయిజ్ అధికారులు తరుచుగా దాడులు జరుపుతున్న గుడుంబా తయారీ ఆగకపోవడం గమనార్హం.

గుడుంబా తయారు చేయడం నేరం...
ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్

నిషేధిత గుడుంబాను తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్య నేరం. ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసి గుడుంబా తయారీ చేస్తున్నవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోం. గుడుంబా స్థావరాలపై ఇప్పటికే పర్యవేక్షణ పెంచాము. గుడుంబాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

నేడు వారసంతలకు వేలం పాట

కాసిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు రెండు వార సంతలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్య దర్శి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం, ఆదివారం జరిగే వారసంతల కోసం వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో స్థానిక గిరిజనులు మాత్రమే పాల్గొనాలని కోరారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. ప్రారంభ ధర రూ. 57,500 ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెన్నూరు పట్టణానికి చెందిన పబ్బ రాకేష్ చికిత్స కోసం రూ. 2.75 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైంది. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన రాకేష్ వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి రాగా ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఇప్పించారు. సంబంధిత పత్రాన్ని బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుశీల్ కుమార్, నాయకులు చింతల శ్రీనివాస్, కొంపెల్లి బానేష్, చెన్న వెంకటేష్, ఉదయ్ ఉన్నారు.

ప్రజల సౌకర్యార్థం మంచినీరు

కలెక్టర్ కుమార్ దీపక్



వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్‌వో ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్డీవో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తున్న నేపథ్యంలో వేసవి దృష్ట్యా ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 40వేల వ్యయంతో వాటర్ ఫిల్టర్ గంటకు 80 లీటర్ల నీటిని అందిస్తుందన్నారు.

వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలి

బెల్లంపల్లి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వీధి కుక్కల భయంతో బయటికి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారన్నారు. ఇటీవల పట్టణంలో వరుసగా చిన్నారులపై ప్రజలపై దాడులు చేస్తున్నా కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టలేదన్నారు. బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ సబ్బని అరుణ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తివిత్తనాలు వాడొద్దు

కాసిపేట, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రైతులు నకిలి పత్తివిత్తనాలు వాడుకొని ఆర్థికంగా నష్టపోవద్దని మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్, కోమటిచేనులోని రైతులకు నకిలి పత్తివిత్తనాలు అరికట్టడం, అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలి పత్తి విత్తనాలు వాడడం వల్ల వాతావరణం కలుషితమవడంతో పాటు భూమి సారం కోల్పోయి నిర్జీవంగా మారుతుందన్నారు. దీని వల్ల మనుషులు కూడ రోగాల బారిన పడుతారన్నారు. భూమి ఆరోగ్యానికి పర్యావరణానికి మనుషులకు క్యాన్సర్, పశువులకు హాని చేసే గ్లైసిల్ పత్తివిత్తనాలను అమ్మినా, సాగు చేసిన విత్తన నియమావలి ప్రకారం చట్ట ప్రకారంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ రవీందర్, ఏఈవోలు రమ్య, సంధ్యరాణి పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లను ప్రారంభ దశలోనే అరికట్టాలి

నెన్నెల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో వరి పంటకు నష్టం కలిగించే తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేప ట్టాలని నెన్నెల ఏవో పుష్పాల సృజన అన్నారు. శుక్రవారం మన్నెగూడంలో క్షేత్రస్థాయిలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. అగ్గి తెగులు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలు సూచించారు. మోతాదుకు మించి పురుగు మందులు, ఎరువులు వాడకూడదన్నారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటేనే రసాయన మందులను పిచికారి చేసుకోవాలన్నారు. వానాకాలం సీజన్‌లో గ్లైసిల్ పత్తి విత్తనాల జోలికి వెళ్లకుండా బ్రాండెడ్ విత్తనాలు వాడాలని సూచించారు. ఏఈవో రాంచందర్ ఉన్నారు.

తిరుపతిలో మందమర్రి మహిళల కోలాటం



తిరుమలలో కోలాటం ప్రదర్శన ఇచ్చిన మందమర్రి మహిళలు

మందమర్రిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానంలో మందమర్రికి చెందిన మహిళలు కోలాటం నృత్య ప్రదర్శన ఇచ్చారు. మూడు రోజుల క్రితం మందమర్రి నుంచి వెళ్లిన మహిళలు అలిపిరి వద్ద బుధవారం కోలాటం ప్రదర్శన ఇచ్చారు. తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతిని పురస్కరించుకుని చేపట్టిన కోలాటం ప్రదర్శనలో మహిళలు పాల్గొన్నారు. తిరుమలకు వెళ్లిన వారిలో శ్రీలత, లావణ్య, శ్రీదేవి, ఉమ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గర్మిళ్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో శుక్రవారం గద్దెరాగడిలోని అమ్మగార్డెన్ పక్కన మంజునాథ హిల్స్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాదులు, పలు ప్రథమ పరీక్షలు హోమియో మందుల ద్వారా ఎలా తగ్గించాలో అవగాహన కల్పించారు. కాలనీలో ప్రజలు పెద్ద మొత్తంలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ పరశురాం, ఆసుపత్రి వైద్య సిబ్బంది దేవేంద్ర ప్రసాద్, గీత, కేర్ హోమియోపతి డాక్టర్ సీఎండీ ఏఎం రెడ్డి పాల్గొన్నారు.

యోగాపోటీలకు రెఫరీగా మండల వాసి

జన్నారం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా రెఫరి డిప్లామా ఆన్‌లైన్ పరీక్షల్లో మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్‌కుమార్ ప్రతిభ కనబరిచటన్లు తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి సిద్దారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి రెఫరీ పరీక్షల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 130 మంది పరీక్షలు రాయగా జన్నారం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్ కుమార్ అర్హత సాధించినట్లు తెలపారు. ఆయనున్న యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ చేతుల మీదుగా ఆన్‌లైన్‌లో ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జన్నారం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఫైర్ అధికారి డి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విపత్తులపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను విద్యార్థులకు ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కమలాకర్, అగ్నిమాపక సిబ్బంది శివకుమార్ ఉదయ్ కిరణ్, ప్రశాంత్, రమేశ్, ఉపాధ్యాయులు గోవర్ధన్, రాజన్న పాల్గొన్నారు.

శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

రామగుండం సీపీ అంబర్‌కిషోర్ ఝూ



పదవీ విరమణ పొందిన అధికారులతో రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝూ

మంచిర్యాలక్రైం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన అధికారులు తమ కుటుంబ సభ్యులతో శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూ అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పదవి విరమణ పొందిన అధికారులకు ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం క్లిష్టమైన పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రస్తుతం పదవీ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు వారి ఉద్యోగ జీవతంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నారన్నారు. కొందరు శాంతి భద్రతల కోసం ప్రాణాలను సైతం అర్పించినవారున్నారని గుర్తు చేశారు. విరమణ పొందినవారు కుటుంబ సభ్యులతో హాయిగా ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఆర్‌ఐ దామోదర్, సూపరింటెండెంట్ మనోజ్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐ, అధికారుల సంఘం అధ్యక్షులు మోతె లింగంలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలి

మంచిర్యాలక్రైం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ట్రాన్స్‌జెండర్ల పట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావులు అవహేళన చేసి మాట్లాడారని తక్షణమే క్షమాపణ చెప్పాలని ట్రాన్స్‌జెండర్ల నాయకులు శుక్రవారం మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద ధర్నా కార్యాక్రమంలో చేపట్టారు. ఈసందర్భంగా ట్రాన్స్‌జెండర్ అధ్యక్షురాలు సిహెచ్. అర్చన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్లకు ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే సమస్య ప్రస్తావనకు వచ్చినప్పుడు ట్రాన్స్‌జెండర్ల సమస్యల అంశం వచ్చినప్పుడు నవ్వుతూ అవహేళన చేసిన హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాతృఛాయ ఫౌండే షన్, ప్రెసిడెంట్ నాంపల్లి నీతు, మంచిర్యాల జిల్లా ట్రాన్స్ జెండర్ సభ్యులు పాల్గొన్నారు.



మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



దండేపల్లిలో..

జన్నారం మండల కేంద్రంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. అలాగే దండేపల్లి గ్రామానికి చెందిన బొమ్మెన లక్ష్మిరాజం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. -దండేపల్లి/జన్నారం



జన్నారంలో..

ఆధార్,పాన్ లింక్ లేక వేతనాల్లో కోత

ఐటీ కోతతో ఇబ్బందులు పడుతున్న కార్మికులు



మందమర్రిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణాలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఇన్కమ్ ట్యాక్స్ రూపేనా ప్రతీ నెల కేటగిరీల వారీగా 30 వేల నుంచి 50 వేల వరకు కట్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది కార్మికులు ఆధార్, పాన్ కార్డుకు లింకు చేసుకోలేదని పెద్ద మొత్తంలో వేతనాలు కట్ చేస్తున్నారు. దీంతో కార్మికులకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండు నెలలుగా లింకు లేని కార్మికులకు వారు చేసిన నెలసరి వేతనం మొత్తం ట్యాక్స్ రూపేనా రికవరీ చేసుకోవడంతో కార్మికులు ఆవేదనకు గురవుతున్నారు. లక్ష వేతనం ఉంటే కనీసం సగం వేతనం కట్ చేసుకొని అయినా 50 వేలు కోత విధించి 50 వేలు అయినా వేతనం ఇస్తే కుటుంబ పోషణ గడుస్తుందని, కాని అలా చేయకుండా మొత్తం కోత విధించడం వల్ల కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. ఈ విషయంపై గనుల వద్ద సంక్షేమాధికారుల నుంచి మొదలుకొని జీఎం కార్యాలయంలోని అకౌంట్స్ డిపార్టుమెంట్లలో అడిగినా కూడా దీనిపై తాము ఏం చేయలేమని, స్వాప్‌లోనే రికవరీ అవుతున్నాయని చెబుతున్నారు. దీని వల్ల కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆధార్, పాన్ లింకు కాని కొంత మంది కార్మికులకు సంబంధించి ఈ మార్చి వరకు కూడా మొత్తం వేతనాలు రికవరీ అవుతాయని కూడా అధికారులు చెబుతున్నారు. దీని వల్ల కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనా నెలసరి వేతనం మీదనే ఆధారపడే కార్మికులకు పాన్, ఆధార్ లింకు కాకపోవడం వల్ల జరిగిన తప్పిదాన్ని తెలుసుకొని లింకు చేసి టాక్స్ ఫైల్ చేసుకున్నప్పటికీ మొత్తం వేతనాలు రికవరీ కావడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. యాజమాన్యం పునరాలోచన చేయాలని కోరుతున్నారు. దీనిపై సింగరేణిలో జాతీయ సంఘాలు కాని, మిగతా కార్మిక సంఘాలు మాట్లాడకుండా మౌనంగా ఉండడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో యాజమాన్యం నెలసరి వేతనం మొత్తం కట్ చేయకుండా కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని కొంతైనా చెల్లించాలని కార్మిక వర్గం కోరుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:25 (శనివారం సాయంత్రం)

సహర్: 4:56 (ఆదివారం ఉదయం)

గుప్పుమంటున్న గుడుంబా



- పల్లెల్లో పెరుగుతున్న స్థావరాలు
- దాడులు జరుగుతున్నా ఆగని తయారీ
- జిల్లా వ్యాప్తంగా 195 కేసులు నమోదు

మంచిర్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిషేద జాబితాలో గుడుంబా మళ్లీ నివురుగక్కు తుంది. కొంతకాలం పాటు జిల్లాలో పూర్తిగా నిషేధంలో ఉన్నప్పటికీ రెండేళ్లుగా విపరీతంగా స్థావరాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా మారుమూల మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల పరిధిలో పెద్ద మొత్తంలో గుడుంబా తయారవుతున్నట్లు తెలుస్తోంది. వరుసగా దాడులు జరుగుతున్న జంకని ఉత్పత్తిదారులు అధి కారులు కళ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా తమ పనిని కానిస్తున్నారు. జిల్లాలోని మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ఎక్సయిజ్ స్టేషన్‌ల పరిధిలో దాదాపు నిత్యం గుడుంబా పట్టుబడుతున్న కేసులు నమోదవుతున్నాయి.

● ఏరులైపారుతున్న గుడుంబా...

బెల్లంపల్లి పానకం, స్పటికతో కూడిన గుడుంబా జిల్లాలో ఏరులై పారుతోంది. కోటపల్లి, మందమర్రి, జన్నారం, వేమనపల్లి, నెన్నెల, తదితర మండలాల పరిధిలో వందల సంఖ్యలో స్థావరాలు ఉన్నట్లు ఎక్సయిజ్‌శాఖ అధికారులు గుర్తించారు. స్థావరాలపై మూకుమ్మడి దాడులు జరుపుతు పెద్దమొత్తంలో గుడుంబాను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇటీవల గుడుంబా స్థావరాలపై జరుగుతున్న దాడుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని పలు హోల్‌సేల్ దుకాణాల్లో గంపగుత్తగా బెల్లం, స్పటిక కొనుగోలు చేస్తూ తరలిస్తున్నారు. అనంతరం మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక బట్టీలు ఏర్పాటు చేసి గుడుంబా తయారీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆయా గ్రామాల్లోని కొందరు గుడుంబా తయారీనే ప్రధాన వృత్తిగా పెట్టుకున్నట్లు సమాచారం. అలా తయారీ చేసిన గుడుంబాను ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా గమ్యాలకు చేరుస్తున్నారు.



మందమర్రి మండలం పులిమడుగులో గుడుంబాను ధ్వంసం చేస్తున్న ఎక్సయిజ్ అధికారులు (ఫైల్)

● జిల్లాలో 195 కేసులు నమోదు...

జిల్లాలోని నాలుగు ఎక్సయిజ్ స్టేషన్ల పరిధిలో జనవరి 1 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఏకంగా 195 కేసులు నమోదుకావడం గమనార్హం. గుడుంబా తయారు చేసి విక్రయాలు జరుపుతున్న 205 మం దిని ఈ సందర్భంగా ఎక్సయిజ్ అధికారులు పట్టుకొని వారిపై కేసులో నమోదు చేశారు. జిల్లాలోని వివిధ స్థావరాల వద్ద ..

మిగతా 7లో

4న బీజాపూర్ జిల్లా బంద్

మంచిర్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేస్తున్న' హంతకకగార్ దాడుల్లో మావోయిస్టులు, ఆదివాసీ ప్రజలు 78మందిని హత్యచేయడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పశ్చిమ బస్తర్ డివిజన్ అధికార ప్రతినిధి మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 25నుంచి మూడు మాసాల్లో 78మంది అమరులయ్యారని ప్రకటనలో పేర్కొన్నారు. కగార్ దాడులను ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మోదీ, అమిత్‌షాల దుష్టపాలనకు, కగార్ హింసకాండకు వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా పీడిత, ప్రజాస్వామికవాదులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దాడులకు వ్యతిరేకంగా ఏప్రిల్ 4న నిర్వహించే బీజాపూర్ జిల్లా బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో జాగ్రత్త

- వడదెబ్బ తగిలే ప్రమాదం
- అవసరమైతేనే బయటకు వెళ్లాలని వైద్యుల సూచన

6

ప్రతీ ఇంటి నిర్మాణానికి నాణ్యమైన ఇసుక

- నిర్లక్ష్యం చేస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు
- కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): అక్రమాలు, అవకతవకలు లేకుండా ప్రతీ ఇంటి నిర్మాణానికి నాణ్యమైన గోదావరి ఇసుకను తక్కువ ధరకు అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రాయిపేట, కొల్లూరు ఇసుక రీచ్‌లను మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరుకు పలు సూచనలు చేశారు. త్వరగా లోడ్ చేసి లారీలను పంపించాలని రోజుకు ఒక్క రీచ్ నుంచి 200 లారీల ఇసుకను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మరో జేసీబీతో పాటు కూలీల సంఖ్యను పెంచాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. రోడ్డు మీద ఒక్కలారీ కూడ ఉండవద్దని ట్రాఫిక్ జామ్ అయితే కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తక్కువ ధరలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. ఈ ప్రాంతంలో రెండు క్వారీలు నడుస్తున్నాయని ఇంకా కొన్ని క్వారీలను ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ లోడ్ చేసి తూకం వేసి పంపేందుకు కాంట్రాక్టర్ వద్ద కొన్ని లోపాలు ఉన్నాయని ప్రతి రోజు 60 నుంచి 70 లారీలు మాత్రమే వెళ్తున్నాయని దీంతో లారీలు గంటల కొద్ది వేచి చూస్తున్నాయన్నారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన పలు రికార్డులు పరిశీలించారు. పాఠశాలల ప్రహరి గోడల పనులు సత్వరం పూర్తి చేయించాలని ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ సోలార్ రక్షిత నీటి ట్యాం క్‌ను పరిశీలించారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్ పరిస్థితి మోడల్ ఉపాధ్యా యుడు సురేందర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భవనం శిథిలం కావడం, గదులు సరిపోకపోవడం వసతులు లేకపోవడం వల్ల అడ్మిషన్లు తగ్గుతున్నాయని సదరు ఉపాధ్యాయుడు తెలుపగా స్పందించిన కలెక్టర్ 200మంది విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేపిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో లక్ష్మయ్య, రూరల్ సీఐసుధాకర్, ఎస్ఐ రాజేందర్, ఏపీవో వెంకటేశ్ పాల్గొన్నారు.



ఇసుక రీచ్ వద్ద కాంట్రాక్టర్‌కు సూచన చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని చెల్లాయిపేట, సుందరశాలలోని ప్రాథమిక పాఠశాలలు, పొక్కూరు ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయాలను శుక్రవారం సందర్శించారు. మెనూ అమలు గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ నూతన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, పరిశుభ్ర మైన మంచి నీళ్లు అందించాలని సూచించారు. చెల్లాయిపేట ప్రహరి గోడ పనులు పూర్తిచేసే విధంగా స్థానిక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎంపీడీవో మోహన్ ఉన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

దండేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నివసిస్తున్న విభిన్న ఆచారాలు, వ్యవహారాలు, వారి సంస్కృతులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దండేపల్లి మండలం గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హర్యానాలో ప్రజల వేషధారణ, పండగలు, ఆహారపు అలవాట్లు, వారి సంప్రదాయాలను శుక్రవారం ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమలాకర్, ఉపాధ్యాయురాలు స్రవంతి, అంగన్‌వాడీ టిచర్ల గోపతి శైలాజ, సీఆర్‌పి ఉగ్గే రమేష్ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ



సీసీసీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ భాస్కర్

నస్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో పదవతరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జోన్‌లో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ యాక్ట్-2023 అమలులో ఉంటుందన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచిం చారు. డీసీపీ వెంట మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, పోలీస్ అధికారులు ఉన్నారు.

రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి



మహనీయుల చిత్రపటాలతో కాంగ్రెస్ నాయకులు

లక్షెట్టిపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిన బాధ్యత ఉందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ.ఆరీఫ్ అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు పట్టణకేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న జైబాపు, జైబీం, జైసంవిధాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదన్నారు. ఇటీవల బీజేపీ లాంటి పార్టీ పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేశాలను రెచ్చకొడు తున్నాయన్నారు. ఇలాంటి సమయంలో శాంతి అహింసలకు మూల సూత్రాలుగా మనకు భోదించిన మహాత్ముడి స్ఫూర్తిగా మనసులంతా ఒక్కటే అంటూ గ్రామ గ్రామాన ర్యాలీలు తీస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్‌రావు, చింత అశోక్, ట్రాన్స్‌పోర్టు డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు చెల్ల నాగభూషణం, రాందేని వెంకటేష్, సురేష్‌నాయక్, నాయకులు వెంకటస్వామిగౌడ్, ముత్తెసుధాకర్ ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● రాష్ట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిరవధిక పోరాటాలు చేస్తామని ఎస్సీఎస్టీ రాష్ట్రకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి కలిసి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుశాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదోవ పట్ట కుండా అధికారులు పర్యవేక్షించా లన్నారు. జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసులు బాధితులకు జరగాల్సిన న్యాయం అందిన పరిహారం ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన భూ పంపిణీ, భూ వివాదాలు, పోడు భూముల పరిష్కారం, విద్యార్థులకు ప్రత్యేక వసతులపై సమీక్షించారు. పోలీసుస్టేషన్‌లో నమోదైన అయిన కేసులపై ప్రభుత్వం సత్వరమే పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ కమిషన్ దృ ష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులను సమన్వయం పరుస్తున్నామన్నారు. భూ సంబంధిత దరఖాస్తులు కనీసం 15రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, కొముురం నీలాదేవి, రేణికుంట్ల ప్రవీణ్, శంకర్, డీసీపీ భాస్కర్, జిల్లా అటవీఅధికారి శివాజీ సింగ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం అర్థరాత్రి మండలంలోని రాపన్‌పల్లి వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో నార్కొటిక్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి ఇటువైపు వచ్చే వాహనాలు చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే వాహనాలను ఆపి నార్కొటిక్ ఎనా లసిస్ డాగ్‌తో పాటు పోలీసు సిబ్బందితో అన్ని వాహనాలను, వారి సామగ్రిని తనిఖీ చేశారు. గంజాయి రహిత ప్రాంతంగా మార్చడానికి ఉన్నతాధికారుల ఆదేశాలతో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ఆకస్మికంగా తనిఖీలు, పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్, ఎక్సయిజ్‌శాఖ అధికారులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

- నిత్యం అదనంగా 1 మిలియన్ యూనిట్ల వాడకం...
- అధిక ఉష్ణోగ్రతలు, యాసంగి పంటలే కారణం..



నస్పూర్‌లోని 133కేవి సబ్ స్టేషన్

నస్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చడంతో పాటు అధిక ఉష్ణోగ్రతలతో గృహాల విద్యుత్ విని యోగం పెరగడానికి కారణమైయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ప్రతి రోజు ఉష్ణోగ్రతలు 40డిగ్రీల సెల్సియస్ దాటిపోతుంది. దీంతో జనాలు చల్లదనంకోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం గణనీయంగా పెంచారు.. అంతే కాకుండా యాసంగి పంటలు కూడా సాగు చేస్తున్నందున విద్యుత్‌వాడకం పెరగడానికి కారణమైంది. జిల్లాలో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవ సాయ, ఇతర్రాత రంగాలకు నిత్యం 3.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ కోటాను నిర్ధేశించింది. ప్రస్తుతం జిల్లా విద్యుత్ విని యోగం 4.63 మిలియన్ యూనిట్లకు చేరింది. ఎండల పరిస్థితి ఇలాగే ఉంటే వినియోగం మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవి ఎండల తీవ్రత తో విద్యుత్ వినియోగం కేటాయించిన యూనిట్ల కంటే అదనం గా 1.093 మిలియన్ యూనిట్ల వాడకం పెరిగింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఏప్రిల్ మాసం నాటికి మరింత పెరిగే అవకాశం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు భావిస్తున్నారు.

● జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు...

మంచిర్యాల జిల్లాలో గృహ, వాణిజ్య, వ్యవసాయ, పరిశ్రమల, ఇతర విద్యుత్‌కనెక్షన్లు 3,60,214 ఉన్నాయి. గృహాల కనెక్షన్లు-2,69,092, వాణిజ్య కనెక్షన్లు-32,875, పరిశ్రమలు-1542, వ్యవసాయ కనెక్షన్లు- 48,872, ఇతరాత్ర కనెక్షన్లు-7833 ఉన్నాయి. వీటన్నింటికి నిత్యం 3.97 మిలియన్‌యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీరు అడుగంటి పోయింది. దీంతో అందుబాటులో ఉన్న నీటిని విద్యుత్ మోటర్ల ద్వారా యాసంగి పంటలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చడంతో మార్చిలోనే విద్యుత్ వినియోగం అధికంగా పెరిగిపోయింది.

● విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి..



విద్యుత్ వినియోగదారులు విద్యుత్ వాడకాన్ని పొదుపుగా వా డుకోవాలి. జిల్లాకు ఉన్న విద్యుత్ కోటా కంటే ఒక మిలియన్ యూనిట్ల విద్యుత్ అదనంగా వాడకం పెరిగింది. రానున్న రోజు ల్లో వినియోగం పెరిగే అవకాశం ఉంటుంది. యాసంగి పంటలు చివరి దశకు చేరుతున్నాయి. పంటలు పూర్తయితే వ్యవసాయ రంగ విద్యుత్ వినియోగం తగ్గిపోతుంది. గృహ జ్యోతి కింద ప్ర తీ నెల 200 యూనిట్ల లోపు జీరో బిల్లు లబ్ది పొందుతారు. 200 యూనిట్ల కంటే ఒక యూనిట్ ఎక్కువ ఉన్నా మొత్తం బిల్లు కట్టాల్సి ఉంటుంది.

-విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్- మంచిర్యాల

మంత్రి జూపల్లి మాటలు వెనక్కి తీసుకోవాలి...

- యాదవ ఒగ్గు పూజారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం కుమార్

నస్పూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : యాదవుల అస్థిత్వాన్ని దెబ్బ తీసే విధంగా మల్లన్న దేవుడు కురుమలతండ్రి అని వార సత్వం జెగ్గు చేతికి వచ్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడిన మాటలను వెనక్కితీసుకోవాలని యాదవ ఒగ్గు పూజారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజనవేన శ్యాంకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని పుణ్యక్షేత్రాలైన కొమురవెల్లి, వేలాల, గొల్లగట్టు జాతరలో ఒగ్గు పూజారులుగా యాదవులు పని చేస్తున్నారన్నారు.

మంత్రిని తప్పుదోవ పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చింతల రాయమల్లు, అల్లం మల్లేష్, పరిస ఐలయ్య, ఎగ్గె రమేష్, బాసవేన భానేష్, అంగ మల్లేష్, గాలి పర్వతాలు, ఐలయ్య, పత్రి పోచన్న, రాజన్న, మొగిలి, వెంకటేష్, గాలి కోమురయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాం కుమార్ యాదవ్